విద్వేషాలు రెచ్చగొడుతున్న మోడీ ప్రభుత్వం

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర - రావికమతం: రానున్న 2024 ఎన్నికల్లో నరేంద్ర మోడీ అధికారం కోసం కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. ఆదివారం మండలంలో మండల కార్యదర్శి జోగిరాజు ఆధ్వర్యంలో జి.చీడిపల్లి గ్రామంలో కమిటీ సభ్యులతో సమావేశమై ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో మతకల్లోలాలు సృష్టించి గిరిజనుల సాగు భూములను ఆదాని కంపెనీకి దోచి పెట్టేందుకే అల్లర్లు సృష్టించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజిన్ సర్కారులా పనిచేస్తున్నాయని ఈ రెండు ప్రభుత్వాలను సాగనంపకపోతే రాజ్యాంగానికు పెను ముప్పు వాటిల్లుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు, ప్రజా సంఘాలకు, కార్మికులకు ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఎటువంటి సమస్యలున్నా పోరాటాలకు పూనుకోకుండా ఉద్యమాలను పోలీసులచే రాష్ట్ర ప్రభుత్వం అణిచి వేసేందుకు దిగుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి 7 పర్యాయములు విద్యుత్ ఛార్జీలు పెంచారని, పక్క రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ 7500 ఉంటే మన రాష్ట్రంలో 32000కు రైతులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, వి.శ్రీను, జోగారావు, కుమారి, సేనపతి శ్రీను, ఈశ్వరరావు, దొర తదితరులు పాల్గొన్నారు.

దాతల పట్ల చిన్న చూపు



విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దాతలకు సరైన గౌరవం దక్కటం లేదని దాతలు వాపోతున్నారు. పలువురు దాతలు వెండి, బంగారు వస్తు రూపేణా విరాళం ఇస్తామంటే ఎందుకండి హుండిలో వేసేయండి అంటూ కొంతమంది సిబ్బంది దాతలతో అన్నట్లు సమాచారం. దాత బంగారు హారం విరాళం ఇవ్వటానికి అప్పట్లో సుమారుగా పదిహేను రోజులు పట్టినట్లు ఓ ఉన్నతాధికారి ద్వారా అధికారికంగా విరాళం ఇచ్చినట్లు తెలిసింది. ఇందుకు కొన్ని ఉదాహరణలు ఆలయంలో భద్రత నిమిత్తం 2018లో కొంత మొత్తం దాతల సహకారం, దేవస్థానం అధికారులు లక్షల రూపాయిలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన 6 డోర్ మెటల్ డిటెక్టర్లు, 4 హ్యాండ్ మెటల్ డిటేక్టర్లు కొనుగోలు చేశారు. అవి ఏమయ్యాయో, ఎక్కడదున్నాయో ఎవరికి తెలియదు. 2020లో పాత తలుపులకు ఇత్తడి రేకు తాపడం చేసి ఉండేది. నీలాద్రి గుమ్మం ద్వారాలకు స్వర్ణ రేకులను (తాపడం) చేయిస్తామని దాత ముందుకు వచ్చారు. ఆయనకు సరైన గౌరవం దక్కక ఆ పని కాస్త అటకెక్కింది. ఏసిలు, ఫ్రిడ్జ్ లు, వాల్ ఫ్యాన్లు, ఇత్తడి గుర్రం (ఎక్కడుందో తెలియదు), వరహరూపం(ఇత్తడి) విగ్రహం, పలు బంగారు, వెండి, ఇత్తడి , వాహనాలు ఇలా అనేక విరాళాలు ఇచ్చిన దాతలు గగ్గోలు పెడుతున్నారని భక్తులు, స్థానికులు అంటున్నారు. ఎంతసేపు ఆలయ ఉన్నతాధికారులకు, దర్శనాలకు వచ్చే వారికి పాలిష్ సేవ చేయటం తప్పా తీసుకుంటున్న జీతానికి, స్వామివారికి నిజమైన సేవ ఎంతవరకు చేస్తున్నామని ఏనాడైనా ఒక్క క్షణం వారి వారి మనస్సాక్షిగా ప్రశ్నించుకున్నారా? అని కొందరు ఉద్యోగులు అంటున్నారు. పూర్వం ఆలయ అభివృద్ధికి ఎంతోమంది దాతలు స్థిర, చర, ధన, వస్తు రూపేణా విరాళాలు ఇచ్చేవారు ఇస్తున్నారు. అటువంటి వారి పట్ల అధికారులు, సిబ్బంది చిన్న చూపు చూడటం ఎంతవరకు సమంజసం అని భక్తుల వాదన. ఎంతసేపు వి.ఐ.పి , వి.వి.ఐ.పిల సేవ, లేదంటే తమకు ఏమైనా ఫలానా దానివలన లాభం కలసి వస్తుందా లేదా అనే ఆలోచనతో విధులు ఆలయంలో నిర్వహిస్తారు తప్పా ? దేవునికి, ఆలయానికి పనికి వచ్చే పనులు చేయరని భక్తులు అంటున్నారు. అదేవిధంగా ఆలయానికి దాతలు డబ్బు లేదా వస్తువులు ఇచ్చిన రోజు మాత్రమే వారికి సర్వ సేవలు చేస్తారని, తరువాత ఎప్పుడైనా స్వామి దర్శనానికి వస్తే పట్టించుకునే వారు ఎవరు లేరని డోనర్ అయితే ఎవరికి ఎక్కువ అనే సందర్భాలు కోకొల్లలు అని భక్తులు ఆలయ అధికారులపై మండి పడుతున్నారు. ఎంతో చరిత్ర కలిగిన వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి ఆలయం పరిస్థితి ఏమిటి అని చాలా బాధాకరంగా ఉందంటూ భక్తులు తమ మనస్సులోని మాట తెలిపారు.

పరిశ్రమలు ఉన్నా స్థానికులకు ఉద్యోగాలు లేవు

టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: నియోజకవర్గంలో పెద్ద పరిశ్రమలు రెండు ఉన్నప్పటికీ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా నియోజవకర్గంలోని మత్స్యకారుల ఆధ్వర్యంలో దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేసే సమయంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన పరిశ్రమ యాజమాన్యాలు, పరిశ్రమలు ఏర్పాటు తర్వాత స్థానికులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వడం లేదన్నారు. మత్స్యకార గ్రామాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప మరే అభివృద్ధి జరగలేదన్నారు. పార్టీ పరిశీలకులు యనమల కృష్ణుడు మాట్లాడుతూ మత్స్యకారులకు గుర్తింపు తీసుకొచ్చింది తెలుగుదేశం పార్టీయే అన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో చైర్మన్ పదవులు వేస్తున్నారేగాని వారు కూర్చోడానికి కుర్చీలు కూడా లేవని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతో కలసే ఉన్నట్లు తెలిపారు. ఫ్యాక్షన్ కుటుంబంలో పుట్టిన జగన్, తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని లక్షల కోట్లు ఆర్జించారని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి వైసీపీని గద్దె దింపి, టిడిపికి అధికారాన్ని చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, మత్స్యకార నాయకులు మైలపల్లి సింహాచలం, గోసల తాతారావు, బొంది కాశీ విశ్వనాద్, వంకా వెంకటరమణ, గోసల శ్రీకాంత్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మల్ల పురెడ్డి రమాకుమారి, వల్లా విలియంకేరి, సూరా సుబ్రమణ్యం, పెదిరెడ్డి నాగవెంకట రమణ, వేములపూడి అప్పారావు, చిరుకూరి పేర్రాజు, వంకా శివ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలి

ఉప ముఖ్యమంత్రి బూడికి సీపీఐ వినతి

విశాలాంధ్ర - కె.కోటపాడు: దీర్ఘకాలంగా సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు నేతృత్వంలో సీపీఐ బృందం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజాన దొరబాబు, వేచలపు కాసుబాబులు మాట్లాడుతూ మూడు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న రైతులకు ఎటువంటి హక్కులు కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. 2005లో దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో సీపీఐ పోరాట ఫలితంగా 12 గ్రామాలకు చెందిన 600 మంది రైతులకు 700 ఎకరాల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు ఎవరికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. మర్రి వలస గ్రామంలో సర్వే నెంబరు 2లో 113 ఎకరాల భూమికి సరైన రెవెన్యూ రికార్డులు లేవని పక్కన పెట్టేసారని అన్నారు. దీనివల్ల 60 కుటుంబాల వారు నష్టపోతున్నారని అన్నారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సానుకూలంగా స్పందించి పక్కనే ఉన్న ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గొర్లెటలె దేముడు బాబు, రెడ్డి అప్పలనాయుడు, సీమసిరి సూర్యనారాయణ, ఇల్లాకు రాము, దమ్ము ముత్యాలనాయుడు, పొంతపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు డీఎస్సీ ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. ఆదివారం మర్రివలస గ్రామానికి పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా మంత్రి బొత్సను పలువురు ఉపాధ్యాయులు కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ప్రతినిధి సిరికి సూర్యనారాయణ మాట్లాడుతూ 1998వ సంవత్సరంలో డీఎస్సీ ఉపాధ్యాయులుగా నియమించబడ్డామని అయితే పలు రకాల కారణాలతో ఇటీవల చేసిన చట్టం ప్రకారం ఖాళీగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించబడ్డామన్నారు. ఇప్పటికీ అనేకమందికి వయసు మీరిపోవడంతో అర్హత సాధించలేకపోయారని, విశాఖ జిల్లాలో కేవలం 355 మంది ఉపాధ్యాయులు మాత్రమే మిగిలి ఉన్నారని అన్నారు. తామందర్నీ రెగ్యులరైజ్ చేయాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో బండారు మంగవతి, వేచలపు ఈశ్వరరావు, బి.సత్యారావు, జయంతి సుబ్బారావు, కె.జగన్నాథం, ఓ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే పోర్టు అభివృద్ధి

విశాలాంధ్ర - విశాఖ : ఉద్యోగుల సహకారంతోనే పోర్టు ఎంతో అభివృద్ధి చెందిందని పోర్టు ట్రస్ట్ మాజీ ట్రస్టీ బిసిహెచ్ మసేను అన్నారు. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ 90వ ఆవిర్భావ దినోత్సవం హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విశాఖపట్నం పోర్టుకి ఎంతో చరిత్ర ఉందని అన్నారు. అదేవిధంగా పోర్టు ట్రస్ట్‌ని ప్రైవేటుపరం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. బెర్తులను బహుళ జాతి కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నాయని మండిపడ్డారు. విశాఖపట్నం పోర్టును కాపాడు కోవాలంటే ప్రతి ఉద్యోగి ఉద్యమించాలని అన్నారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అనంతరం సత్య హరిచంద్ర పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదకరంగా మారిపోయిందని మేధావులు, రాజకీయ పార్టీలు ఏకమై జగన్ రెడ్డి రాజ్యాంగాన్ని తిప్పి కొట్టాలని విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం విశాఖలో అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సేవ్ డెమోక్రసీ, డెమోక్రసీ ఇన్ డేంజర్ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం చాలా అద్భుతమని, దీన్ని ఏర్పాటు చేసిన ఆదారి కిషోర్ కుమార్‌కి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ అభినందనలు తెలిపారు. ప్రస్తుతం డెమోక్రసీ ఏ పరిస్థితిలో ఉంది అనే దానిపై చర్చలో భాగంగా ధర్మం నాలుగు కాళ్ళపై నడవాల్సిన పరిస్థితి ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఒక్క కాలు విరిగిపోయి కుంటి కాలుతో నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

దేశంలో గల రాష్ట్రాలలో పరిణామాలు చూస్తుంటే చాలా ఆందోళన కరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బై బై జగన్ జగన్ పాలనకు చరమగీతం పాడాలని అన్ని వర్గాల్లో చైతన్యం తీసుకువచ్చి రాబోయే రోజుల్లో చేయవలసిన కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. ఈ సమావేశంలో జనసేన నేత శివశంకర్, దళిత సంఘం నాయకులు పాల్తేటి పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి నవరాత్రుల రాట మహోత్సవం

విశాలాంధ్ర - మల్కాపురం: స్థానిక 40వ వార్డు ఏకేసీ కాలనీలో దుర్గాదేవి నవరాత్రుల రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాకింగ్ యూత్, భవాని భక్తుల ఆధ్వర్యంలో ఏటా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. నవరాత్రి ఉత్సవాలు 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఏయూని సందర్శించిన ఐసిసిఎస్ఆర్ డైరెక్టర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసిఎస్ఎస్ఆర్) డైరెక్టర్, ఏయూ పూర్వవిద్యార్థి వై.రమేష్ విచ్చేసారు. ముందుగా ఏయూ గ్రంథాలయ, ప్రభుత్వ పాలన, రాజనీతిశాస్త్ర విభాగంలో వివిధ విభాగాల విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి ప్రసంగించారు. పరిశోధన పత్రాల ప్రచురణలో, పోస్ట్ డాక్టర్టల్ గ్రాంట్స్, ఫారిన్ ట్రావెల్ గ్రాంట్, డాక్టరల్ ప్రోగ్రామ్స్, రీసెర్చ్ ప్రాజెక్టులు మంజూరు చేయడం వంటి అంశాలను విపులంగా వివరించారు. ఏయూలో జరుగుతున్న వివిధ స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏయూ సిబ్, ఎలిమెంట్, అల్గారిథమ్, ఆ-హబ్‌లను సందర్శించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వై.రమేష్ మాట్లాడుతూ ఏయూని నూతన శిఖరాలకు తీసుకువెళ్లే దిశగా దార్శినికంగా పనిచేస్తున్న విధానాన్ని ప్రశంసించారు. పూర్వవిద్యార్థిగా ఏయూ నూతన మౌళిక వసతులతో విరాజిల్లుతోం దన్నారు. అధికారులు విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దిన మౌళిక వసతులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నాను. ఐసిఎస్ఎస్ఆర్ అందించే వివిధ పరిశోధన సంబంధ ప్రాజెక్టులకు దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున రమేష్‌ని సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.ధనరాజు, డాక్టర్ జి.శివప్రసాద్, డాక్టర్ జి.ప్రభాకర్, పి.శెంకటేశ్వర్లు, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ హరి బాబు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రత్నరాజు పాల్గొన్నారు.

గీతం మూట్‌కోర్టు పోటీల విజేత క్రీస్ట్ వర్శిటీ

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు ఆదివారం ముగిసాయి. గీతం మూట్, అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలో గీతం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి పేరుతో ఈ పోటీలను వర్చువల్ విధానంలో ప్రముఖ న్యాయ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 34కి పైగా ప్రముఖ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 400 మంది న్యాయ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. కాగా పోటీలలో అత్యంత ప్రతిభను కనబరిచిన బెంగళూరుకు చెందిన క్రీస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాలయం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా వివేకానంద స్కూల్ ఆఫ్ లా రన్నరప్‌గా ద్వితీయ స్థానంలో నిలిచింది. బెస్ట్ రీసెర్చర్‌గా ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీ విద్యార్థిని ఆకృతి సింగ్ బెస్ట్ స్పీకర్‌గా అదితి శర్మ ఎంపికయ్యారు. బెస్ట్ మెమోరియల్‌గా వివేకానంద స్కూల్ ఆఫ్ లా జట్టు ఎంపికైంది. తెలంగాణా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ పేటెంట్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖ మాజీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.రాఘవేందర్, గీతం న్యాయ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు, మూట్ కోర్టు పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ వర్ధమాన్ పాల్గొన్నారు.

మార్గదర్శకాలు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు పలు ఇబ్బందులు పడుతున్నారని, ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఆనందపురం వై జంక్షన్ బ్రిడ్జ్‌పైన చెక్ పోస్ట్ వద్ద డీసీపీ, ఏసీపీ ఆదేశాల మేరకు మార్గదర్శకాలు ఏర్పాటు చేశామని ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం తెలిపారు. విజయనగరం నుంచి వచ్చే వాహనాలు ఆనందపురం బ్రిడ్జిపై నుంచి వెళ్లాలంటే ఇదివరకు వాహనదారులు బ్రిడ్జిపైన వై జంక్షన్ వద్ద గమ్యం తెలియక వేరే రూటు వెళ్ళిపోతుండడంతో వారికోసం మార్గదర్శకాలు ఏర్పాటు చేసి చెక్‌పోస్ట్ వద్ద బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు.

అక్రమ అరెస్టులకు అధైర్య పడేది లేదు



విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: అక్రమ అరెస్టులకు టీడీపీ నాయకులు భయపడరని రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం అన్నారు. ఆదివారం సాయంత్రం 87వ వార్డ్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేని పరిపాలన చేస్తున్నారని, అభివృద్ధి చేతకాని ముఖ్యమంత్రి కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని మా అధినేతను విడుదల చేసే వరకు నిరసనలు, దీక్షలు కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్ రాజ్, విజయరామరాజు, సత్తిబాబు, డివి అప్పారావు, కర్రీ కన్నారావు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, వర్రే రాంబాబు, కె.ఈశ్వరరావు, వివిఎన్ మూర్తి, కె.అశోక వర్మ, బొండా పైడ్రాజు, బొడ్డ సన్యాసి, పెంటయ్య, ఎస్.బాబురావు, ఎస్. అప్పారావు, కే.సన్యాసిరావు, ఎస్.సూర్యారావు, నాగేశ్వరరావు, దేవుళ్ళు, జి.శీను, బి.శ్రీను, ఏటీఎస్.మూర్తి, ఆటో సూరిబాబు, పోతురాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

జనసేనకే టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతాం

జనసేన నాయకులు గెడ్డం బుజ్జి

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ పొత్తులో భాగంగా జనసేన పార్టీకే పాయకరావుపేట నియోజవర్గం టిక్కెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరతామని జనసేన నాయకులు గెడ్డం బుజ్జి తెలిపారు. నియోజకవర్గ టీడీపీ పార్టీ పరిశీలకులు యనమల కృష్ణుడు చేసిన వ్యాఖ్యలను గెడ్డం బుజ్జి తీవ్రంగా ఖండించారు. పాయకరావుపేట టిక్కెట్టు వంగలపూడి అనితకేనని, గెలుపు, మంత్రి కూడా యనమల కృష్ణుడు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీ టిక్కెట్లు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయిస్తారని, టికెట్లు కేటాయింపు పని యనమల కృష్ణుడిది కాదని తెలిపారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పూర్తిగా మద్దతిస్తే వంగలపూడి అనిత ఎమ్మెల్యేగా గెలుపొందారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకే టిక్కెట్ ఇవ్వాలని నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారని తెలిపారు.

10న గొండు సీతారాం అనకాపల్లిలో పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఈ నెల 10 మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపిఎస్సీపిసీఆర్) సభ్యులు గొండు సీతారాం అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. మంగళగిరి నుండి ఆరోజు ఉదయం 9 గంటలకు పట్టణానికి చేరుకోనున్న ఆయన మహా విశాఖ నగర పాలక సంస్థ, అనకాపల్లి జోన్ విభాగం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలు సంయుక్తంగా ప్రజా ప్రతినిధులు, వార్డుల మహిళా సంరక్షణ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి 2006, బాల్య వివాహాలు నిషేధ చట్టం, జి.ఓ.నెంబర్.31పై గుండాల జంక్షన్, కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు జివిఎంసి టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో బాలల హక్కుల పరిరక్షణలో మండల విద్యా శాఖాధికారులు పాత్ర అనే అంశంపై జరగనున్న సమావేశంలో ఆయన పాల్గోనున్నారు. సమయానుసారంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లను ఆకస్మికంగా సందర్శించే అవకాశం ఉందని అనంతరం ఆయన రోడ్ మార్గాన మంగళగిరికి పయనం కానున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

వైసీపీని గద్దె దింపే రోజులు దగ్గరలోనే ఉన్నాయి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గర పడ్డాయని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అనకాపల్లి ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు అన్నారు. స్థానిక కోటినీ వీధిలో ఆదివారం రాత్రి జనసేన పార్టీ కార్యాలయంను పరుచూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలన అంతమొందించడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. మధ్య నిషేధాన్ని ప్రకటిస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఏరులలై పారించారని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని ఆయన విమర్శించారు. తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు వెళ్లి అనకాపల్లిలో వైసీపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. వై నాట్ 175 అన్న జగన్ మోహన్ రెడ్డిని ఎందుకు రాష్ట్రం నుంచి తరిమివేయాలని తెలియజేసే 120 ప్రశ్నలతో కూడిన కరపత్రాన్ని తెలుగుదేశం, జనసేన పార్టీ రంగులతో ముద్రించి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు నాయకులు ఈ ప్రచారాన్ని వార్డుల్లో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అనకాపల్లిలో జనసేన జెండా ఎగురవేయాలని, ప్రతి వార్డులో కమిటీలు తక్షణమే నియమించి జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలని జన సైనికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జనసైనికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు పరుచూరి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యాలయానికి ఉచితంగా ఆఫీసు ఇచ్చిన రాజేష్ ను పరుచూరి ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. అంతకుముందు రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కోటిని సూరిబాబు, మజ్జిశ్రీనివాసరావు, దుద్దు నాగేశ్వరరావు, సేనాపతి గణేష్, (బాలు) వీర మహిళ స్వాతి, అడ్వకేట్లు కళావతి, రామచంద్రరావు, జనసేన టౌన్ వర్కింగ్ కమిటీ సభ్యులు గంట గోవిందా, శ్రీకాకుళపు జగ్గారావు, శిరసా పల్లి ప్రసాద్, టిడిపినాయకులు కోటినీ రాంబాబు, కోటిని రామకృష్ణ, తలారి లక్ష్మీప్రసాద్ బైండింగ్ శ్రీను,, తెలుగు మహిళలు కోటినీ ఉమా, బిశెట్టిహేమ, కాయలప్రసన్నలక్ష్మి, పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం పొంగలిపాక యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. సుమారుగా 30 మంది వరకు రక్తదానం చేశారు. ఈ శిబిరానికి ఛత్రపతి శివాజీ వలంటీర్ బ్లడ్ సెంటర్ మేనేజర్ మట్టా సాయికుమార్ సహకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయన సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఉందూరు దేముడు, యువకులు పచ్చికూర నాగేశ్వరరావు, ఉందూరు శేఖర్, ఉందూరు గంగాధర్, శెట్టి నరేంద్ర, నిట్టా వెంకటేష్, ఉప సర్పంచ్ ఉందూరు భాస్కర్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు కోసం పడిగాపులు

విశాలాంధ్ర - రావికమతం: రావికమతం మండలం కొత్తకోటలో గత నాలుగు రోజులుగా ప్రజా పంపిణీ రేషన్ బియ్యం ప్రజలకు అందడం లేదు. బియ్యం పంపిణీకి సంబంధించిన యంత్రం సాంకేతిక లోపంతో తరుచూ మోరాయిస్తూ ఉండడంతో పాటు సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ సాగడం లేదు. గ్రామంలో సుమారు ఎనిమిది రేషన్ సరఫరా డిపోలు ఉండగా సుమారు 8 వేల రేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెల ఒకటి నుంచి 15 వ తేది వరకూ సరఫరా చేయాల్సి ఉంది. గ్రామంలో ఇంత వరకూ కనీసం 30 శాతం మందికి కూడా సరుకులు సరఫరా కాలేదు. సరుకులు పంపిణీకి రెండు వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో వాహనానికి నాలుగు డిపోల సరుకులు పంపిణీ చేస్తారు. అయితే ప్రస్తుతం డిపో నెంబర్ 7లో బియ్యం పంపిణీని చేపట్టారు. ఈ డిపో పరిధిలో ఎస్సి కాలనీ, అరందతి కాలనీలలో లబ్ధిదారులు ఉన్నారు. వీరికి సరుకులు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మండల స్థాయి అధికారులకు తెలిపినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనితో రేషన్ సరుకులు కోసం లబ్ధిదారులు డిపోల పడి గాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి సరుకులు పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నవరాత్రి ఉత్సవాల ముహుర్తపు రాట

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో ఆదివారం ఉదయం శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల నేపధ్యంలో ముహుర్తపు రాటను ఏర్పాటు చేశారు. దేవి నవరాత్రుల సంబంధించి చలువ పందిళ్ల ఏర్పాటుకు ఆలయ అర్చకులు నున్న వాసు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాట ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ యడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, శ్రీమోద కొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, వైసిపి పట్టణ అధ్యక్షులు బమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఎస్.వి.కొండలరావు, అన్నంనీడి ప్రసాదరావు, మోటార్ యూనియన్ సభ్యులతో పాటు ఇల్లపు రమణ, జవ్వాది వరహాలు, శిలామంతుల జ్యోతి, శ్రీనాథు వెంకటరాజు, చింతాడ శివ, లక్కిడపురాజు, బి.నరసింహమూర్తి, మేస్త్రి సూరిబాబు, పాలకుర్తి సురేష్ కుమార్, గండి జోగి నాయుడు, కె.కొండలరావు, నాని, ప్రసాద్, గణేష్, నాగోజీ రమణ, బి.కృష్ణ, మల్లేశ్వరరావు, మోటార్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కుమ్మరి శాలివాహన సంఘం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ ఉమ్మడి జిల్లా కుమ్మర శాలివాహన సంఘం సమావేశం 97వ వార్డు కుమ్మరి కాలనీ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా నుండి పలు మండలాల, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంఘం నూతన జిల్లా ప్రెసిడెంట్ తాటిపూడి వెంకటేశు మాట్లాడుతూ కుమ్మరవృత్తిలో గ్రామీణ, నగరప్రాంతంలో మట్టిని నమ్ముకొని జీవనోపాధి చేస్తుంటాం. ఈ వృత్తి కొనసాగించాలంటే ప్రధానంగా ఒక ప్రాంతంలో మట్టి సేకరణ కోసం ఒక స్థలం కేటాయించాలి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎక్కడ ఎటువంటి చెరువులు గాని ఖాళీ స్థలంగాని కనుమరుగైపోయాయి. కులవృత్తిని నమ్ముకున్న మేము వెనుకబాటుతనంలో ఉన్నాము. కావున ప్రభుత్వం ఇప్పటికైనా మా కుమ్మరి వృత్తిని ఆదుకొని గ్రామాల్లో గాని, నగరాల్లో గాని అందుబాటులో మట్టి ఉన్న ఖాళీ స్థలాన్ని ,చెరువును ప్రత్యేకంగా కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వృత్తిపరమైన పనులు లేకపోవడం వల్ల ,చాలామంది మా కుమ్మరి లు కూలీ పనులు కోసం వలసలు పోతున్నారు. ప్రత్యేకంగా ప్రభుత్వం మా కుమ్మరవృత్తి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ఎక్కడ వారు అక్కడ వృత్తిపరమైన పనులు చేపట్టి జీవనోపాధి చేసుకోవడానికిఆధారం చూపెడతారని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో మా కుమ్మరి వృత్తి కోసం రాష్ట్రముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సంఘం తరఫున వినతిపత్రం సమర్పిస్తామని అన్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా-తాటిపూడి వెంకటేష్, కార్యదర్శిగా -కొత్తూరు ఉమా భాస్కర్ రావు, కోశాధికారిగా-తాటిపూడి శ్రీనివాసరావు, కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పెందుర్తి మండల కుమ్మరిశాలి వాహన సంఘం ప్రెసిడెంట్ గా భీమా బత్తిన రాము ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకుడు కాజులూరి ధర్మరాజు,పెందుర్తి మండల కుమ్మర సంఘం, పులగాల పాలెం సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టు సభ్యులు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు/ఎటపాక : జన జీవన స్రవంతి లో కలిసెం దుకు మావోయిస్టు లు లొంగిపోయారని అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, ఏఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్పీ ఎదుట అభివృద్ధి కార్యక్రమాలకు పాటు, వివక్షపూరిత సిద్ధాంతాలకు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని అన్నారు. ఆదివారం ఎటపాక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. మావోయిస్టు పార్టీకి ఏరియా కమిటీ సభ్యుడితో పాటు ప్లాటు సభ్యుడు ఒకరు, ఎస్పీ మా ముందుట లొంగిపోయిన నేపథ్యంలో చింతూరు డివిజన్ ఎటపాక పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. చతిస్గడ్ రాష్ట్రం దంతే వాడ జిల్లా, పర్చేలి గ్రామానికి చెందిన వెట్టి దుల్గా నిత్యం వ్యవసాయ పనులు చేస్తూ ఉండేవాడని మావోలు సభలు వారి గ్రామంలో పెడుతున్నదంతో వాటికీ ఆకార్షితుడైయ్యాడని, 2016,17, సంత్సరంలో మడివి దేవా నేతృత్వంలో కాటే కళ్యాణ్ ఏసీ, సి ఎన్ ఎం లో పనిచేసాడని, 2018సంత్సరం నుండి జులై 2022 వరకు దర్భా డివిసి 26వ ప్లాటూన్ డివిఎం అయినా జైలాల్‌కి గన్మెన్‌కి బదిలీ చేయబడ్డాడని, మల్లి అతను 24వ ప్లాటూన్ మలం గిరి కమిటీ, దర్భా డివిసి కి రాంసాయి, డివి సి ఎం ఆధ్వర్యంలో బదిలీ చేయబడ్డాడు అన్నారు. 2018సంత్సరాలు లో, సూకమాజిల్లా లోని నీలావై గ్రామంలో ఏసీ, ఎస్పి ఐ డివి సి 30వ ప్లాటూన్ తో సహా మావోయిస్టులు వేసిన అంబుస్ లో పాల్గొన్నాడు. ఇతనికి సరేండర్ పాలశీల ప్రకారం లొంగిపోయినా దూల్గా కి లక్ష రివర్డు, తో పాటు అర్హత కలిగిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎస్సై పార్థ సారథి, సిఐ గజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రోప్లాస్టిక్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు తరగతులను ప్రారంభించారు. యూరోపియన్ కమీషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మెత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. శిక్షణలో భాగంగా ప్రత్యక్ష అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ మానవ జీవనానికి మెరైన్ ఎకోసిస్టమ్ ఎంతో అవసరమని, ప్లాస్టిక్ కాలుష్యం నుంచి దీనిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య వి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

'బాబుతో నేను' కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యూరు : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగానే పాడేరు నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నేతృత్వంలో ఆ పార్టీ కొయ్యూరు మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని బూదరాళ్ల పంచాయతీ అత్యంత మారుమూల గ్రామాలైన లోయలపాలెం నూకరాయితోట బాలరేవుల తదితర గ్రామాలలో నేతలు బాబుతో నేను కరపత్రాలను ఇంటింటికి పంచుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అధినేత చంద్రబాబును ప్రభుత్వం అక్రమంగా అన్యాయంగా అరెస్టు చేయటాన్ని ప్రతి ఒక్కరూ ఖండిస్తూ బాబుకు అండగా నిలవాలని నేతలు కోరారు. అనంతరం బాలరేవుల గ్రామంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు మేడిపోయిన సత్తిబాబు, జీలకర్ర శ్రీను, మాదల బుజ్జిబాబు మండల తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు వాసం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఋషికొండ కాదు... మన్యం కొండ

విశాలాంధ్ర - చింతపల్లి: మైదాన ప్రాంతంలోని ఋషికొండను తలపించే ఈ కొండ మన్య ప్రాంతంలోని పెంటపాడు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి చెందినది. వివరాల్లోకి వెళితే. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని అంతర్ల - పెంటపాడు గ్రామాల మధ్య గల శ్రీ సోమలింగేశ్వర స్వామి ఆలయ సమీప కొండ ప్రాంతం. పట్టా భూమి అయిన ఈ ప్రాంతంలో 516 జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి మట్టి, మెటల్ తదితర ముడి సరుకు తయారు కేంద్రంగా గుత్తేదారుడు స్థావరం ఏర్పాటు చేసుకొని గడిచిన కొన్ని నెలలుగా పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న కొండ ప్రాంతం ఇప్పటికే తవ్వకాలు జరగడంతో కొండ తరిగిపోవడమే గాక త్రాగునీటి వనరులు కలుషితం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో గత్యంతరం లేని గిరిజనులు ఆ నీటిని త్రాగి అంగవైకల్యం బారిన పడుతున్నారు. దీంతోపాటు ఇతర రుగ్మతలు దాడి చేస్తున్నాయి. దిగువ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు త్రాగునీటి సమస్య తలెత్తుతుంది. అదే క్రమంలో ఊట గెడ్డలు కనుమరుగవ్వడంతో త్రాగునీరు, పంట పొలాలకు గిరి రైతులు వినియోగించే అంతర్ల సమీప చెక్ డ్యామ్ లోని సాగునీరు ఇంకిపోయాయని గిరి రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో చెక్ డ్యామ్ లోని సాగునీరు ద్వారా సాగయ్యే సుమారు 150 ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇదే క్రమంలో

సకాలంలో వర్షాలు కురిస్తేనే సాగుబడి ముందుకు సాగుతుందని, లేని పక్షంలో పెట్టుబడులు కూడా చేతికి రాని దుస్థితి దాపురిస్తుందని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పాత్రికేయులతో సమాజంలో విప్లవాత్మక మార్పులు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

విశాలాంధ్ర - నర్సీపట్నం: స్వాతంత్రోద్యమం ఉద్యమం నుంచి విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో గాని, సమాజానికి విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో అందించడానికి పాత్రికేయులు చేస్తున్న కృషి ఎనలేనిదని ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. రోలుగుంట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హాజరయ్యారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నానాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ సమసమాజ స్థాపనలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించింది పాత్రికేయూలేనన్నారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడ్డలు తెలియజెప్పి ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులకు వారధిగా నిలుస్తున్న ఘనత వారికే దక్కు తుందన్నారు .గతంలో ఎందరో విలేకరులు సమాజాన్ని చైతన్యపరిచే విధంగా కథనాలు రాసేవారని, ఇప్పుడు అటువంటి కథనాలు పెద్దగా కనిపించడం లేదన్నారు. సమాజాన్ని చైతన్యపరిచే విధంగా పత్రికలు, ఛానళ్ళు ఉంటేనే గౌరవం లభిస్తుందన్నారు. అలాంటి వారిలో తాను ఎంతోమంది మేధావుల్ని ,మహనీయులని చూసానని, వారిలో దివంగత సీనియర్ పాత్రికేయులు అమర్నాథ్ తదితరుల పేర్లను చెప్పి వారి సేవలను కొనియాడారు. విలేకరులు విధి నిర్వహణలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వాటిని అధిగమించి వారు సమాజానికి మంచి చేయాలని పడుతున్న తాపత్రయం అభినందనీయ మన్నారు. జర్నలిస్టుల సమస్యలపై తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. చోడవరం విలేకరులకు ఇంటి స్థలాలను మంజూరు చేశామని తన నియోజకవర్గంలో మిగిలిన విలేకరులకు కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం విలేకరుల%శ్%తా ఆయనను సత్కరించి జ్ఞాపికను అందచేశారు. సమావేశంలో ఎంపీపీ శ్రీను జడ్పిటిసి పోతల శీను, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు స్వామి, జిల్లా అధ్యక్షులు జోగి నాయుడు, కార్యదర్శి చంద్ర రావు ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కిషోర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చిన్నయ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాబ్జి, కోటవరట్ల, గొలుగొండ నాతవరం, నర్సీపట్నం, రోలుగుంట పాత్రికేయుల పాల్గొన్నారు.

అమెజాన్ - నీల్సన్ ప్రీ-ఫెస్టివ్ సర్వే నిర్వహణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పండుగ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, నీల్సన్ మీడియా సహకారంతో భారతదేశం వ్యాప్తంగా ఉన్న 35 నగరాల్లోని 8519 మందితో ఒక లోతైన పండుగ-ముందస్తు సర్వేను అమెజాన్ ఇండియా నిర్వహించింది. అమెజాన్ ఇండియా కోసం ప్రత్యేకంగా నిర్వహించబడిన ఈ అధ్యయనం అనేది దక్షిణ భారతదేశంలోని కొనుగోలు దారుల పెరుగుతున్న ప్రాధాన్యతలు మరియు అంచనాలు గురించిన విలువైన అంతర్దృష్టులను అందించింది. అదనంగా, పండుగ షాపింగ్ కోసం, ప్రత్యేకించి కుటుంబ సభ్యులతో కలసి వేడుక చేసేందుకు, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు అత్యంత అనుకూలంగా ఉంటాయని 80% మంది వినియోగదారులు చెప్పారు.అమెజాన్ ప్రాముఖ్యత: దక్షిణ భారతదేశంలో పండుగ షాపింగ్ కోసం అమెజాన్ డాట్ ఇన్ అత్యంత విశ్వసనీయ ఆన్‌లైన్ గమ్యస్థానంగా ఉంటోంది. ప్రతిస్పందించినవారిలో 50 శాతం మంది ఈ ప్లాట్‌ఫామ్ మీద వారి విశ్వాసం ప్రదర్శించారని తెలిపారు.

జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందికి అభినందన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందిని ఈఎన్ఎస్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అభినందించారు. వాగిర్ సిబ్బందితో వారి విస్తరించిన కార్యాచరణ విస్తరణ నుండి తిరిగి వచ్చినప్పుడు వారితో సంభాషించారు. విజయవంతమైన మిషన్‌పై సిబ్బందిని ఆయన అభినందించారు. కెప్టెన్ ద్వారా విన్యాసానికి సంబంధించిన ముఖ్యాంశాలను ఆయనకు వివరించారు. ఐఎన్ఎస్ వాగిర్ స్వదేశీంగా నిర్మించిన కల్వరి తరగతి జలాంతర్గాములలో ఐదవది.

శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఎగ్జిక్యూటివ్ బాడీ అధ్యక్షుడు పుల్లేపు శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రి బ్రాహ్మణ భవనంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కందర్ప వెంకట రామేశం, కందర్ప కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. నియోజకవర్గంలో బ్రాహ్మణుల వివరాలు సేకరణ, సభ్యుల సంక్షేమానికి తీసుకోవలసిన చర్యలపై సమావేశం కొనసాగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానో పాధ్యాయులు గుంటూరు సత్యనారాయణ, సంఘం ప్రధాన కార్యదర్శి వింజమూరి శంకర్, కందర్ప మూర్తి, ఉపాధ్యాయుల శ్రీనివాస రావు, ఎం.ప్రసాద్, రాంబాబు, ఉపాధ్యాయులు దక్షిణామూర్తి, టి.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పాస్టర్స్ దినోత్సవం

విశాలాంధ్ర - జీకే వీధి: ప్రతి ఏటా అక్టోబర్ నెలలో వచ్చే రెండవ ఆదివారం నిర్వహించుకునే ప్రపంచ పాస్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతపల్లి మండలంలోని చౌడు పల్లి పంచాయతీ బయలు కించంగి మెట్ట వీధి గ్రామంలో ఆదివారం స్థానిక పాస్టర్ అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ సేవకులు (పాస్టర్స్) అందరూ ఏసుక్రీస్తు పిలుపుకు లోబడి పరిచర్య ప్రారంభించి నిందలు, అవమానములు భరించి, ఆకలి, దుఃఖమును ఈనాడు ముఖంలో కనిపించనీయకుండా నిత్యము యేసుక్రీస్తు రాజ్య ప్రకటిస్తూ నిత్యజీవంలోకి అనేక మందిని నడిపిస్తూ ప్రపంచ ప్రజల రక్షణ కొరకు నిత్యం ఏసుక్రీస్తు బోధనలతో పరిచర్యలు చేస్తున్న దైవ సేవకులకు, దైవజనులకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వనరాజు, అధిక సంఖ్యలో మెట్టవీధి గ్రామ క్రైస్తవ సంఘస్తులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని - రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం

విశాలాంధ్ర - కొయ్యూరు: సైకో పాలన నుండి రాష్ట్రానికి విముక్తి కలిగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని జీసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ పిలుపునిచ్చారు. అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాజేంద్రపాలెం వారపు సంతలో ప్రసాద్ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బాబుతో నేను కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ 9261292617 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చి చంద్రబాబుకు మద్దతు తెలపాలని కోరారు. సైకో పాలన నుండి రాష్ట్రానికి విముక్తి కలగాలంటే అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. రాజకీయ కక్షతో

చంద్రబాబు పై పెట్టిన కేసులను ఖండిద్దామని, తప్పుడు కేసులపై గళం ఎత్తుదాం - జగన్ కుట్రను ఎండగడదామంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా చంద్రబాబు పక్షానే నిలబడి ఆయనకు సంఘీభావం తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రపాలెం కొయ్యూరు సర్పంచులు వీశా సింహాచలం మాకాడ బాలరాజు తెదేపా నేతలు చిరంజీవి బకీర్ ఖాన్ మేడిపోయిన చిన్న బాచి రాజేష్ కిరణ్ వీరయ్య నాగార్జున కిట్టయ్య తదితర పలువురు పాల్గొన్నారు.

19న కాపు సంక్షేమ సేన వనసమారాధన

విశాలాంధ్ర - మాకవరపాలెం: నవంబర్ 19వ తేదీన కోటవురట్లలో జరిగే కాపు సంక్షేమ సేన అనకాపల్లి జిల్లా స్థాయి కాపు సంక్షేమ సేన కార్తీక వన సమారాధనను జయప్రదం చేయాలని కాపు సంక్షేమ సేన మాకవరపాలెం మండల అధ్యక్షులు గనిశెట్టి గోవింద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ హోంమంత్రి, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామజోగయ్య నాయకత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్న కాపు పెద్దలు వస్తున్నారని, కావున మాకవరపాలెం మండలం నుంచి కూడా భారీ స్థాయిలో తరలివెళ్లడం జరుగుతుందన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుపై నిరసన దీక్ష

విశాలాంధ్ర - మాకవరపాలెం: చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేశారంటూ మాకవరపాలెం మండలం నారాయణరాజుపేట మాజీ సర్పంచ్ దువ్వాసి వెంకట గిరి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబునాయుడును అక్రమ అరెస్టు చేశారన్నారు. ఆయన తొందరలోనే బయటకి రావాలని ప్రత్యేక పూజలతో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు పి.సురేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు దుకాణం దగ్ధం

విశాలాంధ్ర - మాకవరపాలెం: ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక దుకాణం దగ్ధమైంది. మాకవరపాలెం మండలం భీమ బోయినపాలెం శివారు గండిపేట గ్రామంలో గండి అర్జునకు చెందిన బడ్డీ కొట్టు ఆదివారం తెల్లవారుజామున నిప్పంటుకొని మొత్తం కాలిపోయింది. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో కొట్టులో ఉన్న ఫ్రిజ్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ కొట్టు ఆధారంగానే జీవనం సాగిస్తున్నామని అర్జున వాపోయాడు.

చంద్రబాబు అరెస్టుపై చిడతల భజనతో నిరసన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో జగన్ పోవాలి బాబు రావాలంటూ మాడుగుల నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పివిజి.కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వినూత్నంగా చిడతలను వాయిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ముందుగా మోదకొండమ్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి చిడతలు వాయిస్తూ అక్రమంగా అరెస్టు చేసిన చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉండూరు దేముడు, లెక్కల కాశిబాబు, పి.సూర్యనారాయణవర్మ, ఢిల్లీ నానాజీ, జనసేన పార్టీ నాయకులు దాసరి అచ్యుతరావు, పాము నాగరాజు, గుమ్మాల అప్పలనాయుడు, తలారి రమేష్, వేగి రాంబాబు, కాళ్ల నర్సింహారాజు, మిండి వరాహమూర్తి, అప్పాన వెంకటరమణ, పేరపు కొండబాబు, తాటికొండ సత్తిబాబు, పోతల శ్రీను, మజ్జి శ్రీను, కె.ఈశ్వరరావు, కాళంగి నాయుడు, పడాల సత్తిబాబుతో పాటు పలువురు టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమలు తేలేని అసమర్ధ మంత్రి అమర్నాథ్ : బుద్ధ నాగజగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఊసరవెల్లిగా పేరుగాంచిన కోడిగుడ్డు మంత్రి గుడివాడ అమర్నాథ్ రాష్ట్ర%శీ%లో ముఖ్యంగా ఉత్తరాంధ్రలో ఒక్క పరిశ్రమ కూడా తెచ్చిన దాఖలాలు లేవని అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అమర్నాథ్‌పై విరుచుకు పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆంధ్రప్రదేశ్లో పరిశ్రమలు వచ్చేటట్టు నా పూర్తి సహకారం అందిస్తానని చెప్పడం ద్వారా ఈ పరిశ్రమల మంత్రి అమర్నాథ్ ఎంత అసమర్ధతో ఉన్నాడో దీన్నిబట్టి ప్రజలకు తేటతెల్లమవుతుందని నాగ జగదీష్ అన్నారు. కనీసం వాటిని స్వాగతించాలి లేదా సత్తా ఉంటే స్వయంగా పరిశ్రమలు తెచ్చి తన సత్తాను చాటాలని నాగ జగదీష్ సవాల్ విసిరారు. ఐటీకి ఆధ్యుడైన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ఉన్న విజనరీ తో సైబరాబాద్ లాంటి సిటీ నిర్మించి హైటెక్ సిటీ నెలకొల్పి ప్రపంచంలోనే ఐటీ రంగానికి పెద్దపీట వేశారని దీని మూలంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాకుండా భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలన్ని హైదరాబాదు వైపు చూసే విధంగా యువతకు ప్రాధాన్యత కల్పించడంలో అగ్రగన్యుడు చంద్రబాబు నాయుడు 2014 నుండి 19 వరకు నిరుద్యోగ యువతకు 5.75 లక్షల ఉద్యోగాలు కల్పించారని నాగ జగదీష్ తెలిపారు . విశాఖ మహానగరంలో గ్లోబల్ ఇన్వెస్టెంట్ సమ్మిట్ పెట్టి రాష్ట్రానికి 13 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తెలిపారని దీని మూలంగా 6000 వేలు ఉద్యోగాలు వస్తాయని, ఈ సమ్మెటకు ప్రజాధనం 138 కోట్లు ఖర్చుపెట్టిన ఒక్క పరిశ్రమ రాలేదని, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని జగదీష్ ఎద్దేవా చేశారు. అమర్నాథ్ నీకు దమ్ముంటే మేము నెలకొల్పిన స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ఆంధ్ర యూని వర్సిటీలో కళ్ళకు కనిపిస్తున్నటు వంటి వాటిని కొనసాగించి తీరాలని వీధిలో నాడు స్కిల్ డెవలప్మెంట్ సంస్థను కావాలని మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ కేంద్రాలన్నీ దుర్వినియోగం చేశారని కొత్తగా ఏర్పాటు అయిన అనకాపల్లి జిల్లాకి ఒక్క పరిశ్రమ కూడా తేకుండా ఉన్న ఫ్యాక్టరీలో నిర్వీర్యం చేయడంలో అమర్నాథ్ ఘనత వహించాడని నాగ జగదీష్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విధ్వంసాలు చెయ్యడం అరాచక పాలన సాగించడం, అదే కోవాలో చెందిన వ్యక్తి ఈ అమర్నాథ్ అని, ఈయన మాటలకు ఎక్కువ చేతలకు తక్కువ అని, అమర్నాథ్ గారడీలకు మాయ మాటలు చెప్పడం, ఒక్క సిమెంట్ రోడ్డు వేసి అభివృద్ధి చూసి ఓటు వేయమని అడగడం విడ్డూరంగా ఉందని ఉమ్మడి జిల్లాలో నీ మాటలు నమ్మే పరిస్థితిలేదని, అనకాపల్లిలో పోటీ చేస్తే ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి జిల్లా కార్యదర్శి మళ్ళ గణేష్ టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు డివివి అప్పారావు బీసీ నాయకులు సాలపు నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన పొత్తుతో విజయం సాధించబోతున్నాం

రాంబిల్లిలో చంద్రబాబు అరెస్ట్, రిమాండ్‌లపై నిరసన

విశాలాంధ్ర - రాంబిల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ రిమాండుని నిరసిస్తూమండల కేంద్రమైన రాంబిల్లిలో ఆదివారం నాడు చంద్రబాబుకు మద్దతుగా సత్యమేవజయతే రిలేదీక్షను సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో రాంబిల్లి మండల పార్టీ అధ్యక్షులు వసంతవాడ వెంకటేశ్వరరావు (దిన్ బాబు) అధ్యక్షతన రాంబిల్లి మండల కేంద్రం వద్ద చంద్రబాబు నాయుడు మద్దతుగా రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ అతి త్వరలోనే చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని బెయిల్ అడిగి ఉంటే ఇప్పటికే వచ్చేవారిని కానీ తప్పు చేయలేదు కాబట్టి కేసులు కొట్టేయాలని క్వాష్ పిటిషన్ వేయడం జరిగిందని,ఎలాంటి తప్పు చేయని వ్యక్తి నారా చంద్రబాబు నాయుడన్నారు. నియోజకవర్గం ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపి చంద్రుడికి చేతులు అడ్డం పెట్టామని వైసిపి నాయకులు సంబరపడుతున్నారని,2024లో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ కలయికలో సాధించబోయే ఘన విజయంతో ఎక్కడికెళ్లి దాక్కోవాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని,తెలుగు దేశం పార్టీకి పెరుగుతున్న ఆదరణతో వైసీపీ పార్టీ నాయకులుకు భయంపట్టుకుందన్నారు. జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీ కలయికతో అగ్నికి

ఆద్యం పోసినట్లు అయిందని ఇంత వరకు ఏదోలా గట్టెక్కుతామని చూసిన వైఎస్ఆర్సిపి పార్టీ తమ రెండు పార్టీలు కలయికతో మానసిక ధైర్యాన్ని కోల్పోయి ఇప్పుడే ఓటమి అంగీకరించిందని ఉమ్మడి అభ్యర్థుల్ని ఎక్కడ నిలబెట్టిన అత్యధిక మెజారిటీతో గెలుస్తామన్నారు.మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ లాలం భవాని భాస్కర్ మాట్లాడుతూ విడిపోయిన ఆంధ్ర రాష్ట్రాన్ని ఐదు సంవత్సరాలు అహర్నిశలు కృషి చేస్తూ ఒక సమగ్రమైన స్థాయికి తెచ్చే సమయంలో 2019 ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్ గెలిపించడం ద్వారా ఆంధ్ర రాష్ట్రం అస్తవ్యస్తమైందని మళ్లీ ఆంధ్రప్రదేశ్ ఎప్పటిలాగే ఉండాలంటే అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు నాయుడుని గెలిపించుకునే అవసరం ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దూళి రంగనాయకులు, రాజాన రమేష్ కుమార్, మునగపాక మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పప్పల నూకన్నదొర, అచ్యుతాపురం జనసేన పార్టీ అధ్యక్షులు రామదాసు, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి కసిరెడ్డి ప్రసాద్,మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాధ పిల్లల మధ్య తమ బిడ్డ జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉంది

విశాలాంధ్ర - చింతపల్లి : చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తమ బిడ్డ మొదటి జన్మదినోత్సవ వేడుకను అనాధ పిల్లలు ఉంటున్న నల్లబిల్లి చారిటబుల్ ట్రస్ట్ వసతి గృహంలోని నిర్వహించుకోవడం తమకు ఎంతో సంతోషంగా ఉందని స్థానిక గ్రామ నివాసి జోగి , అన్నపూర్ణ దంపతులు అన్నారు. ఈ సందర్భంగా అనాధ పిల్లలకు, విద్యార్థులకు, పరీక్ష అట్టలు, పుస్తకాలు, పెన్నులు, అలాగే ట్రస్ట్ లో ఉంటున్న వారందరికీ అన్నదానం చేశారు. మొదటి పుట్టినరోజు వేడుకలను మేళ తాళాలతో, లైటింగులు, డీజేల మధ్య జరుపుకుంటున్న ఈ రోజుల్లో, వసతి గృహాలలో ఉంటున్న నిరుపేద, అనాధ పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపు కోవడమే గాక, అక్కడున్న పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. వారందరికీ భోజనం పెట్టడమే తమకు ఆనంద మని జోగి, అన్నపూర్ణ దంపతులు అన్నారు., మా ఇల్లు ఆనందంగా ఉంటే మేము మాత్రమే ఆనందంగా ఉంటాం, అదే వసతి గృహాలలో నిరుపేద అనాధ పిల్లలందరూ ఆనందంగా ఉంటే వారితో మేము కూడా ఆనందంగా ఉంటామని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు,.ఈ కార్యక్రమంలో చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యులు, దూనబోయిన రమణ, ఈరెల్లి రాజేష్, ఇందుగ శేఖర్, కిముడు బిలాస్కర్, గంగల శివ, కూనిశెట్టి నానాజీ, వీరబాబు, గుత్తుల లోవరాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర - సీతానగరం : మండలం లోని గత 30 నుండి గ్రామ సచివాల యంలలో ఎంపిడిఓ మహేష్ రెడ్డి, తహశీల్దార్ ఎన్వీ రమణల పర్యవేక్షణలో రెండు టీములు ఆద్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న అరోగ్య సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, పెద్దఎత్తున రోగులు విచ్చేసి తనిఖీలు చేసు కుంటున్నట్లు సీతానగరం, పెద అంకలం ప్రాద మిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శిరీష, ఉషారాణి, రాధా కాంత్‌లు తెలిపారు. ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా రోగులకు వైద్యసేవలు పట్ల ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

ఆధారాలు లేని కేసులో కక్షపూరిత అరెస్టులు

చంద్రబాబు నాయుడుకు సంఘీ భావంగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు

విశాలాంధ్ర - చింతపల్లి : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరశిస్తూ మండలంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసిన నాటినుండి ఆయనకు సంఘీ బావంగా తెదేపా శ్రేణులు వివిధ రూపాలలో నిరసన వ్యక్తం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాంతితో క్రాంతి అనే కార్యక్రమంను చింతపల్లి లో ఆ పార్టీ అరకు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్యానేశ్వరి, అదే క్రమంలో మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావుల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధారాలు లేని కేసులో చంద్ర బాబును అక్రమంగా అరెస్టు చేశారని, ఆయనను తక్షణమే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాలలో ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీ మల ఆనంద్, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం, సరమండ శ్రీధర్, షేక్ ఖాసిం వలి, ఉమర్, సేవా ఈశ్వరమ్మ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కొలపరి మలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

లారీ, వ్యాను ఢీకొన్న ఘటనలో వ్యాను డ్రైవర్‌కు విరిగిన కుడికాలు,. పరారీలో లారీ డ్రైవర్

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి - నర్సీపట్నం ప్రధాన రహదారి కొలువరి ప్రమాదకర మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు భారీ వాహనాలు ఢీకొన్న సంఘటనలో వ్యాన్ డ్రైవర్ కు కుడికాలు విరిగిపోగా మరొక వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మండలంలోని కొమ్మంగి పంచాయతీ కొలపరి సమీపంలో ప్రధాన రహదారి వద్ద శనివారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదానికి సంబంధించి చుట్టుపక్కల వారు ప్రాథమికంగా అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి నుండి లోతుగడ్డ జంక్షన్ మీదుగా ఇసుక కోసం వెళ్తున్న వ్యాను, అదే క్రమంలో లోతుగెడ్డ జంక్షన్ నుంచి చింతపల్లి వైపు

వస్తున్న భారీ లారీ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని వీరవరం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పాంగి నూకరాజు (32) కుడికాలు విరిగిపోగా, వ్యాన్ డ్రైవర్ సహా యకుడు రాజమౌళి పడాల్ (14) తీవ్రంగా గాయపడ్డాడు. రాజమౌళి పడాల్ స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల 2 లో 9వ తరగతి చదువు తున్నాడు. ఆశ్రమ పాఠశాలలో ఉండ వలసిన రాజమౌళి పడాల్ వ్యాన్ ప్రమాదంలో గాయపడటం ఏమిటని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సమాధానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. చుట్టుపక్కల ప్రజలు 108 కి సమాచారం అందించి కాలు విరిగిపోయిన వ్యాన్ డ్రైవర్, సహాయకుడిని హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతపల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కాలు విరిగిన క్షతగాత్రుల్ని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదం సంభవించడంతో హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ అరుణ్ కిరణ్ అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆసుపత్రికి పంపించడంతో పాటు, చింతపల్లి నుంచి నర్సీపట్నం, పాడేరు ల వైపు వెళ్లే రాకపోకలకు ఏర్పడిన అంతరాయాన్ని సుమారు రెండు గంటలు శ్రమించి రాకపోకలను పునరుద్ధ రించేందుకు కృషి చేశారు. అనంతరం ప్రమాద ఘటన.పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీ ధరలలో సాంసంగ్ టీవీ అమ్మకాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : గత 17 సంవత్సరాలుగా అంతర్జాతీ యంగా నంబర్ వన్ టీవీ బ్రాండ్‌గా ఉన్న సాంసంగ్ ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ రోజు టెలివిజన్స్ విస్తృత శ్రేణి పై మెగా డీల్స్ ను ఆరంభించిందని శామ్ సంగ్ ఇండియా విజువల్ డిస్ ప్లే బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోహన్ దీప్ సింగ్ చెప్పారు. నియో క్యూ ఎల్ఈడి టీవీ, క్యూ ఎల్ఈడి టీవీ, క్రిస్టల్ 4కే ఐ స్మార్ట్ టీవీ, ఓ ఎల్ఈడి టీవీ, క్రిస్టల్ విజన్ 4కె టీవీ, క్యూ ఎల్ఈడి 4కె టీవీ, ది ఫ్రేమ్ టీవీ మరిన్ని శామ్ సంగ్ టెలివిజన్ శ్రేణి పండుగ సందర్భంగా రాయితీ ధరలలో అందిస్తున్నామన్నారు. వినియోగదారులు 20 శాతం వరకు క్యాష్ బ్యాక్, 3 సంవత్సరాల వారంటీ ఆనందించవచ్చునని, సులభ ఈఎంఐ ఆప్షన్స్ పొందవచ్చునని చెప్పారు.

ముప్పై ఏళ్ల నాటి అ'పూర్వ' కలయిక

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1992-94 ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు, సుమారు 30 సంవత్సరాల తరువాత ఆదివారం చౌడువాడ రిసార్ట్ లో ఆత్మీయ పలకరింపులతో కలుసుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్న, వివిధ రంగాల్లో స్థిర పడిన స్త్రీ, పురుష మిత్రులు అందరూ సుమారు 70 మంది ఒక చోట కలసి వారి వారి జ్ఞాపకాలును గుర్తు చేసుకున్నారు. అనంతరం ఇంటర్ లో తమకు ప్రైవేటు చెప్పిన బ్రహ్మం మాస్టారు ను ఘనంగా సత్కరించారు. ఈ కలయికను ఏర్పాటు చేసిన వారిలో వై. లోవరాజు, జి.నారాయణ మూర్తి, దేవరపల్లి సత్య, వై.సత్యనారాయణ, ఆత్రేయపురపు రమేష్, వెన్నెల ప్రసాద్, ఎం. శ్రీను, సువర్చల, మంజు తదితరులున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం గురించి ఈ నెల 15న సిపిఎం ఆధ్వర్యంలో రంపచోడవరం లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూ నేమ్ సత్యనారాయణ పిలుపు నిచ్చారు మండల కేంద్రం రేఖపల్లి ఆ పార్టీ కార్యాలయం లో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొలిట్ బ్యూరో సభ్యుడు బీ.వీ రాఘవులు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సిఐటియు ఏ.వి నాగేశ్వరరావు ఈ బహిరంగ సభకు హాజరవుతున్నారనీ ఇంటికో మనిషి ఊరుకో బండి జన సమీకరణ చేసి పెద్ద ఎత్తున కార్యకర్తలు శాఖ సభ్యులు ప్రజలు తరలిరావాలనిఆయన కోరారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సోయం చినబాబు నాయకులు తోడం. రాజు వద్లాది. రమేష్ తాతబాబు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధివినాయక నిమజ్జన కార్యక్రమం

విశాలాంధ్ర - చీడికాడ : మండలంలోని దెబ్బ పాలెం గ్రామంలో వర సిద్ధివినాయక నిమజ్జన కార్యక్రమం ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మధ్యాహ్నం భారీఅన్నసమారాధన సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెములు క్విజ్ మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు విజేతలకు బహుమతులు అందజేశారు సాయంత్రం గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు కోపరేటివ్ ప్రెసిడెంట్ నందరపు రమణబాబు మాజీ ఎంపీపీ దారపు సత్య నారాయణ ఉపసర్పంచ్ డి.గౌరీనాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు

పార్టీల పరిపాలన పరిశీలించి ప్రజలు ఎన్నుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : దేశంలో ప్రతిపక్ష పార్టీలు లేకపోతే అధికార పార్టీలు కళ్ళు మూసుకొని పోయి అహంకారం వ్యవహరిస్తాయని బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. అధికార పార్టీ పక్షపాతంగా వ్యవహరిస్తూ, నియంతలుగా మారే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి దేశంలోనూ అధికార పార్టీతో పాటు నాలుగైదు ప్రతిపక్ష పార్టీలు ఎల్లప్పుడూ ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఏ పార్టీ బాగా పరిపాలన చేస్తుందో చూసుకొని వారికి ఇష్టం వచ్చిన పార్టీని ప్రజలు గెలిపించుకొని అవకాశాలు ఉండాలన్ అనారు. అప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందన్నారు.

బండారు సత్యనారాయణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసిన గాజువాక నియోజకవర్గం 75వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : 75వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మీబాయి ఆధ్వర్యంలో ఈ రోజు వెన్నెల పాలెంలో బండారు సత్యనారాయణ స్వగృహం నందు కలిసారు. కలిసిన వారిలో విశాఖ పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, ఓబిసి ప్రధాన కార్యదర్శి శ్రీమునిరి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ములకలపల్లి పెంటారావు, విశాఖ పార్లమెంటరీ టిడిపి కార్యనిర్వాహ కార్యదర్శి పెద్దాడ సోమినాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు దొమ్మేటి నాగరాజు, ఎల్లంకి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న అవకాశం కల్పిస్తే పాయకరావుపేట నుండి పోటీ చేస్తా

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజి

విశాలాంధ్ర - పాయకరావుపేట : వైసీపీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉన్న తనకు పాయకరావుపేట అసెంబ్లీ టిక్కెట్టు ఇచ్చి పోటీ చేయమని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇస్తే పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్నానని ఎస్సీ (మాల) కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజి తెలిపారు. ఆదివారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ వార్డు సభ్యురాలిగా, జడ్పీటీసీగా, వైసీపీ కాకినాడ జిల్లా పార్లమెంటు అధ్యక్షురాలిగా, రాజోలు ఇన్‌ఛార్జిగా పని చేసినట్లు తెలిపారు. పార్టీకి తాను చేసిన సేవలు చూసే ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ఎటువంటి ఆదేశాలు జారీ చేసినా తుచ తప్పకుండా పాటిస్తానని తెలిపారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. రోజాపై మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. 2019 ఎన్నికల్లో 175సీట్లకు 151 దక్కించుకున్న వైసీపీ, రాబోయే 2024 ఎన్నికల్లో 175కి 175 స్థానాలు కైవశం చేసుకుంటుందని పెదపాటి అమ్మాజి ధీమా వ్యక్తం చేశారు.

దోపిడీ వల్లే చంద్రబాబు జైలుకు వెళ్లారు

ఉత్తరాంధ్ర సమన్వయకర్త సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - కే కోటపాడు : స్కిల్ డెవలప్మెంట్ లో జరిగిన దోపిడీ వల్లే చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్ళవలసి వచ్చిందని వైయస్సార్సీపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఈ మండలం మర్రివలస గ్రామంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతితో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ పూర్తిగా నెరవేర్చారని అన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి చేసి చూపించారని అన్నారు. పల్లె ప్రజలు దూరం ప్రాంతాలకు వెళ్లకుండా ఆయా గ్రామాల్లోనే గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రం ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలన అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. వీటి ద్వారా 90 శాతం పనులు గ్రామస్తులకు తీరినట్లేనని అన్నారు. ఇవే కాకుండా జగనన్న సురక్ష ద్వారా 90 లక్షల మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను నేరుగా అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ నాడు నేడు పథకంలో రాష్ట్రంలో ఉన్న పాఠశాలల స్వరూపాన్ని పూర్తిగా మార్చివేసామన్నారు. గ్రామాల్లో పాఠశాలలు కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లా కనిపిస్తున్నాయని అన్నారు. అంతకుముందు గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రం వెల్నెస్ సెంటర్లను మంత్రులు ప్రారంభించగా, జల్ జీవన్ మిషన్లో భాగంగా ఇంటింటి కొళాయిలు గ్రామంలో సిసి రోడ్లను ఎంపీ సత్యవతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ జెడ్పిటిసి ఈర్లే అనురాధ పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు వైయస్సార్సీపి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

లోతుగెడ్డ ఆసుపత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం హర్షణీయం

ఎంపీపీ అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

విశాలాంధ్ర - చింతపల్లి : మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం హర్షనీయమని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య లు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో పర్యటించిన నేషనల్ హెల్త్ రీసెర్చ్ సెంటర్ బృందం జాతీయస్థాయిలో ఉత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించిన ఆసుపత్రులను ఎంపిక చేసిందన్నారు. వాటి సరసన లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడం హర్షనీయమని అన్నారు. నేషనల్ క్వాలిటీ ఎస్యూరేషన్స్ స్టాండర్డ్స్ కు అనుగుణంగా సేవలందిస్తున్న ఆసుపత్రిలో అల్లూరి జిల్లాలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎంపిక కాగా పాడేరు నియోజకవర్గం నుండి చింతపల్లి మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జి.మాడుగుల మండలం నుండి జి.మాడుగుల ఆరోగ్య కేంద్రం ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఎంపికైన ఆరోగ్య కేంద్రాలకు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు జాతీయ ఆరోగ్య పరిశోధన కేంద్రం ఏడాదికి పది లక్షల రూపాయలు చొప్పున మూడేళ్ళకు 30 లక్షల రూపాయలు మంజూరు చేస్తారన్నారు. జిల్లాలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు నేషనల్ క్వాలిటీ ఎస్యూరేషన్స్ స్టాండర్డ్స్ కు అనుగుణంగా సేవలందించి స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన అల్లూరి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని కోరారు.

వైజాగ్‌లో లెజెండ్స్ లీగ్ క్రికెట్ మ్యాచ్ పోటీలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : లెజెండ్స్ లీగ్ క్రికెట్ రాబోయే సీజన్‌ను విశాఖపట్నంలో నిర్వహించనున్నట్టు లెజెండ్స్ లీగ్ క్రికెట్ సహ వ్యవస్థాపకుడు రామన్ రహేజా తెలిపారు. దేశవ్యాప్తంగా వైజాగ్, జమ్మూ, రాంచీ, డెహ్రాడూన్, సూరత్ 5 నగరాల్లో లెజెండ్స్ లీగ్ క్రికెట్ నిర్వహించనున్నమన్నారు. లెజెండ్స్ లీగ్ క్రికెట్ యొక్క ఫ్రాంచైజీ ఎడిషన్ యొక్క రెండవ సీజన్ 19 మ్యాచ్‌లను కలిగి ఉంటుందని, నవంబర్ 18 నుండి డిసెంబర్ 9 వరకు జరగనుందన్నారు. ఎల్ ఎల్ సి సీజన్ 2 కోసం చివరి మూడు లీగ్ దశ మ్యాచ్‌లకు విశాఖలోని డాక్టర్ వై.ఎస్.ఆర్. రెడ్డి ఏసిఏ-విడిసిఏ క్రికెట్ స్టేడియం లో జరగనున్నాయన్నారు. వైజాగ్‌తో పాటు, లెజెండ్స్ లీగ్ క్రికెట్ మొదటి ఐదు మ్యాచ్‌లకు రాంచీ ఆతిథ్యం ఇవ్వడంతో 4 అదనపు వేదికలకు ప్రయాణిస్తుందని, డెహ్రాడూన్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మూడు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వగా, జమ్మూ నాలుగు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తుంది. లెజెండ్స్ లీగ్ క్రికెట్ సీజన్ 2 యొక్క చివరి దశ సూరత్‌లో లాల్‌భాయ్ కాంట్రాక్టర్ స్టేడియంలో నిర్వహించబడుతుందని చెప్పారు.

సింహాచలం బస్ స్టేషన్ తనిఖీ చేసిన ఈడీ

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్ 1 సి.రవి కుమార్ , డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి. అప్పలనాయుడు సింహాచలం బస్ స్టేషన్ తనిఖీ చేశారు. బస్ స్టేషన్ లో స్టాల్స్ ,పార్సెల్ పాయింట్ పని విధానం తనిఖీ చేశారు. సింహాచలం బస్ డిపో సిబ్బంది కార్పొరేట్ డెబిట్ రూపే కార్డ్ తప్పనిసరిగా తీసుకోవాలని దీని వలన రూ.85 లక్షల ప్రమాద ఇన్సూరెన్స్, అదనపు రూ.5 లక్షల పొందడానికి వీలుగా వుంటుంది అని అన్నారు. బస్ స్టేషన్ లో ఉన్న పార్సెల్ పాయింట్ ని సింహాచలం పరిధిలో ఉన్న కాలనీవాసులు వ్యాపారస్తులు వినియోగించు కోవాలని కోరారు. డ్రైవర్లు కూడా సింహాచలం బస్ స్టేషన్ నుండి డిబిఎస్ కాంప్లెక్స్ కు పార్సెల్ను జాగ్రత్తగా తీసుకొని వెళ్లి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా క్రాస్ రోడ్ లో బస్ స్టేషన్ పార్సల్ పాయింట్ బుకింగ్ అండ్ డెలివరీ ఉండేలాగా చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్ 1 ఏపీఎస్ఆర్టీసీ సి. రవికుమార్ డిపో మేనేజర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీమతి తులసి ఏ ఈ కొండలరావు, సూపర్ వైజర్ లకు ఆదేశించారు

ఆరోగ్య సురక్ష... అందరికీ రక్ష

విశాలాంధ్ర - చింతపల్లి : వైకాపా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి రక్ష అని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యలు అన్నారు. మండలంలోని పెద బరడ పంచాయతీలో ఆ పంచాయతీ సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు పాట్టిక లోవరాజుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా విచ్చేసిన వారు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా తోటీ ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఎంపీపీ అనూష దేవి వైద్య పరీక్షలు చేయించు కున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రజారంజక ప్రభుత్వం అన్నారు. నవరత్నాలతో పాటు నాడు జగనన్న సురక్ష, నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

రూ.5000 ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీడికాడ : మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన తుంపాల రామకృష్ణకు చెందిన రెండు ఆవులు ఆరోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు ఈకార్యక్రమంలో సర్పంచ్ గొర్ల గణేష్ పాతాళం ఎర్రినాయుడు పాతాళం మహేష్ పాతాళం సత్యరావు అప్పలనాయుడు గోవిందా విస్సరపు దుర్గారావు సిరిసపల్లి శ్రీను చంద్రశేఖర్ తమడన సత్తిబాబు తదితరులు పాల్గున్నారు.